క్లుప్తంగా

సంతానలక్ష్మికి విశేష పూజలు

ఉదయగిరి: పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న సంతానలక్ష్మి ఆలయంలో శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



వరికుంటపాడు: మండలంలోని నార్త్‌కొండాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓలు షేక్ మస్తాన్‌వలి, సీహెచ్ రమణయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వెంకటేశ్వర్లు ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు ఎంతో మంది నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఆయన శేషజీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకటేశ్వర్లును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం

చేజర్ల : కోటితీర్థం క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి కోటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ ప్రసాద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు



కావలి: కావలి ఆర్టీసీ డిపోలో వివిధ మార్గాల్లో డాక్టర్ రామస్వామి ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్న లక్కీడ్రా విజేతలకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. పెద్దపవని-లింగసముద్రం మార్గంలో ఎస్కే నాయబ్‌రసూల్, కొమ్మి-కొండాపురం మార్గంలో ఎం సరోజనీదేవి, కావలి- అల్లూరు మార్గంలో జీ పద్మ విజేతలుగా నిలవగా అసిస్టెంట్ మేనేజర్ ఎం కల్పనారెడ్డి బహుమతులను అందజేశారు. డీఎం రాపూరు శ్రీనివాసులు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ రవిప్రకాష్, ఏడీసీ ఎస్ మాల్యాద్రి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.93కోట్లతో చేపట్టిన ఉపాధి పనుల్లో సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై విచారణ జరిపిన అధికారులు రూ.30,920 రికవరీకి ఆదేశించారు. ఎంపీపీ శిరీష, ప్రిసైడింగ్ అధికారి గంగాభవానీ, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏపీడీ మృదుల, ఎంపీడీఓ రజనీకాంత్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



ఆత్మకూరు: న్యాయవాదులపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ న్యాయవాదుల కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆత్మకూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను శుక్రవారం బహిష్కరించారు. ఆత్మకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 1961 న్యాయవాదుల చట్టాన్ని సవరణ చేయడం దారుణమన్నారు. దీని వల్ల దేశంలోని న్యాయవాదుల స్వతంత్రతకు భంగం కలగనుందన్నారు. విదేశీ కంపెనీలకు చెందిన న్యాయవాదులకు మన దేశంలో ప్రాక్టీస్ చేసేందుకు అవకాశం కల్పించడం వల్ల దేశంలోని న్యాయవాదులు భవిష్యత్‌లో నిరుద్యోగులుగా మారే అవకాశం ఉందన్నారు. సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నూరు శాతం లక్ష్యాలను సాధించాలి

ఉదయగిరి: ఉపాధి సిబ్బంది కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని ఎంపీడీఓ అప్పాజీ, ఏపీఓ శ్రీనివాసులు అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో శుక్రవారం వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలానికి 270 ఫామ్‌పాండ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 112 నిర్మాణాలు పూర్తిచేశామన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మినీగోకులం షెడ్లను త్వరగా పూర్తి చేయించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలకు తగిన వసతులు కల్పించాలన్నారు. ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.

భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలి



దుత్తలూరు: కేజీబీవీలో సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ అంజనీదేవి



సీతారామపురం ఉన్నత పాఠశాలలో..



అనంతసాగరంలోని టీజేఎన్ పాఠశాలలో..



దుత్తలూరులోని పాఠశాలలో సైన్ ప్రదర్శన



కలిగిరి: సైన్స్ నమూనాతో చిన్నారులు



సంగం ఉన్నత పాఠశాలలో..



ఉదయగిరి: విద్యార్థులకు బహుమతుల ప్రదానం



వరికుంటపాడు ఉన్నత పాఠశాలలో..

వరికుంటపాడు: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం షేక్ మౌలాలి అన్నారు. వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత సీవీ రామన్ చిత్రపట ం వద్ద నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు సైన్స్ నమూనాలను తిలకించారు.

ఉదయగిరి: వెంగళరావునగర్, బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంగళరావునగర్ పాఠశాలలో సీవీరామన్ చిత్రపటానికి ఎంఈఓ-2 తోట.శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలను పారదోలేందుకు సైన్స్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు నూర్జహాన్, నాయబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిగిరి: బొమ్మరాజుచెరువులోని ఈస్ట్‌వుడ్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నమూనాలను తిలకించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అనుమసముద్రంపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. హెచ్‌ఎం పోతులూరయ్య నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏఎస్‌పేటకు చెందిన నాణేల సేకరణ కర్త ఎండీ వాయిజ్ 200 దేశాలకు చెందిన నాణేలను ప్రదర్శించారు. అనంతరం ఆయన్ని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తిలకించి అభినందించారు.

సోమశిల: అనంతసాగరంలోని టీజేఎన్ పాఠశాల, చిలకలమర్రిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి హెచ్‌ఎంలు బట్రెడ్డి లక్ష్మీప్రసన్న, సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతసాగంలో విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మెట్టుకూరు సుబ్బారెడ్డి, మహేష్, రామసరాజు, వెంకటేశ్వర్లు, మదీనా, కృష్ణారెడ్డి, మాధవి, సురేష్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: నందిపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సీవీ రామన్ చిత్రపటానికి ప్రిన్సిపల్ అంజనీదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించి సైన్స్ నమూనాలను తిలకించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను అభినందించారు. అలాగే దుత్తలూరులోని విశ్వతేజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. నర్రవాడ వైద్యాధికారి హరీష్‌రెడ్డి పరిశీలించి ఉత్తమ నమూనాలు రూపొందించిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ముగ్గతో రూపొందించిన మానవుని అవయవాలు ఆకట్టుకున్నాయి .

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఉదయగిరి: ఇన్విజిలేటర్లకు సూచనలు ఇస్తున్న అధికారులు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్, చీఫ్ సూపరింటెండెంట్ కే వాణిశ్రీ తెలిపారు. శుక్రవారం ఆమె పరీక్ష కేంద్రంలోని అన్ని గదులను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. తొలిరోజు పరీక్షకు ఇంటర్ ప్రథమ సంవత్సరం రెగ్యులర్, ఒకేషనల్ కోర్సులు కలిపి 422 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.

మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె పరీక్షల ఇన్విజిలేటర్లతో సమావేశమై పరీక్షల నిర్వహణపై సూచనలు చేశారు. మర్రిపాడులోని జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల, నందవరం మోడల్ స్కూల్, అనంతసాగరం జూనియర్ కళాశాలలకు చెందిన 248 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు నియమించిన ఇన్విజిలేటర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు ఎం వాసు, పీ జమున కోరారు. శుక్రవారం వారు ఇన్విజిలేటర్లతో సమావేశమై సూచనలు చేశారు. ఇంటర్ బోర్డు సూచించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి గదికి సీసీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించమని తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో పేదలకు అందని వైద్యం



వైద్యశాలలో చికిత్స కోసం చేరిన మురళీయాదవ్

కావలి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పేదలకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని, ఆస్పత్రిని పర్యవేక్షించాల్సిన అభివృద్ధి కమిటీ సభ్యులు కూడా పట్టించుకోవడం లేదని టీడీపీ నాయకుడు గుండ్లపల్లి మురళీయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని చెబుతున్నప్పటికీ, ఏరియా ఆస్పత్రిలో పేదలకు వైద్యసేవలు సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. తాను ఆరోగ్యం బాగాలేక ఏరియా ఆస్పత్రికి వెళ్లగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంతో నివ్వెరపోయానన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు అక్కడే ఉండి కూడా జరుగుతున్న తంతును చూసి ప్రేక్షకపాత్ర వహించారే తప్ప సెక్యూరిటీ సిబ్బంది దురుసు ప్రవర్తనను అడ్డుకోలేదన్నారు. వైద్యులు కూడా రోగులకు మొక్కుబడిగా వైద్యం అందిస్తున్నారని ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు కనీసం మాత్రలు కూడా ఇవ్వకుండా తిప్పుతున్నారన్నారన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ప్రభుత్వ ఆశయానికి వైద్యులు, వైద్య సిబ్బంది, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కావలి: కావలి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం తెలిపారు. కావలి మండలం ఆముదాలదిన్నె, అన్నగారిపాళెం-1, చెంచుగానిపాళెం, గౌరవరం, తాళ్లపాళెం, తుమ్మలపెంట-1,2, చెన్నాయపాళెం, అనెమడుగు, సర్వాయపాళెం, రుద్రకోట, చలంచర్ల, కొత్తపల్లి, సిరిపురం, అల్లూరు మండలం అల్లూరు-1,2, బీరంగుంట, నార్తుమోపూరు, సింగపేట, అల్లూరు-3,4, గోగులపల్లి, గ్రద్దగుంట, ఇస్కపల్లి-1,2 ఇందుపూరు, పురిణి, బోగోలు మండలం బోగోలు-1,4, కడనూతల, జువ్వలదిన్నె, జేపీ గూడూరు, ఏనుగులబావి, నాగులవరం, ముంగమూరు, కోవూరుపల్లి, బిట్రగుంట, తాళ్లూరు, దగదర్తి మండలం బోడగుడిపాడు, చెన్నూరు, దగదర్తి, ధర్మవరం (మనుబోలుపాడు), దామవరం (కేకే గుంట), దుండిగం, కాట్రాయపాడు, వెలుపోడు, ఉలవపాళ్ల, శ్రీరామపురం, తడికలూరు, తురిమెర్లలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో ఆత్మకూరు పట్టణం, మండలంలో 11, అనంతసాగరం మండలంలో 12, ఏఎస్‌పేట మండలంలో 9, సంగం మండలంలో 11, మర్రిపాడు మండలంలో 3, చేజర్ల మండలంలో 10 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు జేసీ కార్తీక్ తెలిపారు.

పంచాయతీల రికార్డులను పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

ఉదయగిరి: పంచాయతీ కార్యదర్శులు పంచాయతీలకు సంబంధించి 35 రకాల రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆత్మకూరు డీఎల్‌పీఓ నయిూమ్‌తాజ్ హుస్సేన్ ఆదేశించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉదయగిరి, సీతారామపురం మండలాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులను మార్చి నెలాఖరులోగా నూరుశాతం వసూలు చేయాలన్నారు. సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

పంచాయతీ వేలం పాటలు వాయిదా

స్థానిక పంచాయతీ కార్యాలయంలో మరమ్మతులకు గురైన ఆటోలు, రిక్షాలకు సంబంధించి శుక్రవారం నిర్వహించాల్సిన వేలంపాటలను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు డీఎల్‌పీఓ తెలిపారు. ఎంపీడీఓ అప్పాజీ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ కరీముల్లా, , సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ షేక్ ముర్తుజా హుస్సేన్ పాల్గొన్నారు.

మైనార్టీ విభాగం మండలాధ్యక్షుడిగా షేక్ రియాజ్

కావలి: కావలి మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ రియాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు హిదయతుల్లా రెహమాన్ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. కావలి మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణోత్సవం



జలదంకి: స్థానిక గంగాపార్వతీ సమేత జానకీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శివ, పార్వతుల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సాయంత్రం 5 గంటలకు తెప్పోత్సవం, రాత్రి అశ్వవాహనంపై గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కూరపాటి దయాకర్‌రెడ్డి, పులుగుంట మధురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులను పాటించాలి

అల్లూరు: రైతులు సేంద్రియ పద్ధతులను పాటించి పంటలను సాగు చేయాలని సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ రాష్ట్రాధికారి ఆర్ వెంకట సునీల్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన అల్లూరులోని పంట పొలాలను సందర్శించి రైతులకు సేంద్రియ ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతిలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. సేంద్రియ పంట ఉత్పత్తులకు మార్కెట్ ధర కన్నా 20 శాతం అధిక ధర లభిస్తుందన్నారు. రైతులు సేంద్రియ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆ యన వెంట ఏఓ వెంకటేశ్వర్లు, వీపీఏలు ఉన్నారు.

శ్రీధర్‌బాబు సేవలు మరువలేనివి



మర్రిపాడు: శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న రైతులు

కలిగిరి/మర్రిపాడు: పొగాకు రైతుల అభ్యున్నతికి పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అందించిన సేవలు మరువలేనివని రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు పేర్కొన్నారు. కలిగిరి, డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాల్లో పొగాకు బోర్డులో వివిధ హోదాల్లో పనిచేసి బదిలీ అవుతున్న శ్రీధర్‌బాబును రైతులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. శ్రీధర్‌బాబు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొగాకు బోర్డులో జీవితానికి సరిపడిన ఆనందం లభించిందన్నారు. రైతులకు లబ్ధి చేకూరే కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. వేలం కేంద్రం నిర్వహణాధికారులు మహేష్‌కుమార్, రాజశేఖర్, కేవీ రామాంజనేయులు ,రైతు సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌బాబు, గాలి నరసప్పనాయుడు, ఆరికట్ల జనార్దన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకుని కళాశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్‌ప్రిన్సిపల్ ఏ నరసింహులు, అధ్యాపకులు కేసీ విక్రమ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి అభినందన



కావలి: స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా మొగిలిచర్ల, లింగసముద్రం క్షేత్రాలకు నడిపిన 25 ప్రత్యేక సర్వీసుల ద్వారా కిలోమీటర్‌కు రూ.54.19 ఆదాయాన్ని సాధించిన సిబ్బందిని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు అభినందించారు. ఆదాయం, ఆక్యుపెన్సీలో ప్రథమ స్థానం సాధించిన కండక్టర్ పీ శ్రీనివాస్, డ్రైవర్ ఎస్కే జలీల్, ద్వితీయ స్థానం సాధించిన కండక్టర్ కే రాంప్రసాద్, డ్రైవర్ బీ కోదండయ్య, తృతీయ స్థానం సాధించిన కండక్టర్ వై శేఖర్, డ్రైవర్ శ్రీనివాసులుకు నగదు బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ కల్పనారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ఖాదర్‌మొహిద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ రవిప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సంగం: గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యారమ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్, వెలుగు, హెల్త్ సిబ్బందితో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీఓ షాలెట్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ సునీత శుక్రవారం తెలిపారు. కొత్తలైన్ల నిర్మాణం చేపడుతున్న కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీ-4 సర్వే పరిశీలన

ఆత్మకూరురూరల్: అశ్వనీపురంలో జరుగుతున్న పీ-4 సర్వేను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం పరిశీలించారు. మండలంలో 57శాతం సర్వే పూర్తయిందని, మార్చి 3వ తేదీలోగా సర్వేను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం

దుత్తలూరు: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ యనమల నాగరాజు శుక్రవారం తెలిపారు. 2019 అక్టోబరు 16కు ముందు ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకుని ఉండి ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు చెప్పారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంపచెట్ల తొలగింపు

ఉదయగిరి: గండిపాళెం గురుకుల పాఠశాల ఆవరణలోని కంపచెట్లను కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ అప్పాజీ జేసీబీ సాయంతో శుక్రవారం తొలగించారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టారు.